క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం


గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

గుడిపాల: రీసర్వేలో భాగంగా వచ్చిన భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. డీబీ పల్లె రెవెన్యూలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలున్న రైతులంతా ముందు కొచ్చి అర్జీలిస్తే వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో చాలామంది రైతుల విస్తీర్ణంలో తగ్గుదల,కొలతల్లో వ్యత్యాసాలు, అన్నదమ్ముల మధ్య భాగపరిష్కారాల విషయంలో విబేధాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించండి


భూ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు ఇస్తున్న రైతులు

తవణంపల్లె: భూ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లెలో భూరీసర్వేలో జరిగిన పొరబాట్లు సరిద్దడానికి గ్రామ సభ నిర్వహించారు. రైతులు మ్యుటేషన్ కోసం 15 అర్జీలు, కోరెలాషన్ ఒకటి, జాయింట్ ఫీల్డు 57 అర్జీలు, విస్తీర్ణం తేడాలు సరిదిద్దేందుకు 14 అర్జీలు, రెవెన్యూ సమస్యలు 16, సర్వే చేయడానికి 71 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గ్రామ సభలో భూ రీసర్వే డీటీ వెంకటరమణ, మండల సర్వేయర్ మురళి, వీఆర్‌ఓ రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే ఉచిత వైద్యం

తవణంపల్లె: పేదలందరికీ ఇంటి వద్దనే ఉచిత వైద్య సేవలందిస్తున్నట్లు డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. ఆయన గురువారం మండలంలోని పట్రపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 40 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులు, గర్భవతులకు, బాలింతలకు, వృద్ధులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దీపావళిని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని రాస్ వృద్ధాశ్రమంలో గురువారం దాత పార్థసారథి నాయుడు వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. తొలుత ఆశ్రమంలో శ్రీ అన్నపూర్ణేశ్వరికి పూజలు చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. తర్వాత దుస్తులు పంపిణీ చేసి దీపావళిని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది ముత్యాలశెట్టి తదితరులున్నారు.

గ్రామాల్లోనే వైద్య సేవలు


రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: గ్రామీణులకు వైద్యసేవలు అందించేందుకు ఇంటి వద్దకే వస్తున్నట్లు డాక్టర్ రష్మిత అన్నారు. వెంగమాంబపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచాన పడ్డ రోగులకు ఇంటివద్దకే వెళ్లి వైద్యం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల తోపాటు గర్భిణులకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, దివ్య, స్వర్ణ, రీటా పాల్గొన్నారు.

ఇద్దరు లాటరీ విక్రేతల అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను వన్‌టౌన్ సీఐ జయరామయ్య అరెస్టు చేశారు. నగరంలోని పాత బస్టాండులో నిషేధిత లాటరీ టికెట్లు విక్రయిస్తున్న సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. నగరానికి చెందిన రాజా, మాణిక్యం లాటరీ టికెట్లు విక్రయిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని, రూ.4 వేల నగదును సీజ్ చేశారు.

26న కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ ప్రతినిధి మునస్వామిమొదలియార్ తెలిపారు. చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయం వారిచే ఉచిత కంటి వైద్యశిబిరం విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంటి జబ్బులు కలిగిన వారు వైద్యశిబిరంలో పాల్గొని, ఉచిత వైద్యసేవలు పొందాలని కోరారు.

డేంజరస్ ఘాట్!

జిల్లాలోని జాతీయ రహదారిపై ఉన్న మొగిలి ఘాట్ అత్యంత ప్రమాదకరంగా మారింది. వాహనాలు అత్యంత వేగంతో దూసుకురావడమే కారణమంటూ అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారి కావడంతో వాహనాలు సుదూరం నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. వారికి అవగాహన లేకపోవడంతో, వేగం తగ్గించకుండా వాహనాలు నడపడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు అంచనాకు వచ్చారు. దానికి తగ్గట్టుగానే స్పీడ్ బ్రేకర్స్, డ్రమ్స్, సూచికబోర్డులు ఏర్పాటు చేశారు. అయితే అధికారులు ఎన్ని రకాల చర్యలు చేపట్టినా ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉండడం గమనార్హం.



దొరచెరువు వద్ద అధికారులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్

- గత నెలలో 14 మంది దుర్మరణం
- గాయపడిన వారు 70 మందికిపైనే
- అయినా దూకుడు తగ్గించని వాహనదారులు
- స్పీడ్ బ్రేకర్లు వేసినా ఫలితం శూన్యం
- డ్రమ్‌లను ఢీ కొంటున్న వైనం


వాహనాలు ఢీకొని ధ్వంసమైన స్టాపర్ డ్రమ్స్

బంగారుపాళెం: మొగిలి ఘాట్ రోడ్డు ప్రమాదాలు రాష్ట్ర స్థాయిలో సంచలనంగా మారింది. గత నెలలో చోటుచేసుకున్న వరుస ప్రమాదాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి. గత నెల 13న ఆర్టీసీ బస్సును కంటైనర్ ఢీ కొనడంతో 8 మంది మృతి చెందారు. 14న కొత్తపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కారు ప్రమాదంలో ముగ్గురు, 26న లారీలు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు, 28న జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మొత్తం 14 మంది మృతి చెందారు. 70 మందికి పైగా గాయపడ్డారు. మొగిలి ఘాట్ ప్రమాదాలపై రాష్ట్ర ముఖ్యకార్యదర్శికి సుప్రీం కోర్టు రహదారుల భద్రతా కమిటీ వివరణ కోరుతూ నోటీసు జారీ చేసింది. దాంతో అధికారులు చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై డ్రైవర్లు వేగనియంత్రణ చర్యలు పాటించక పోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్షించి, మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణ కోసం అవసరమైన చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాంతో మొగిలి ఘాట్‌లో జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు, స్టాపర్ డ్రమ్‌లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

చెక్ పోస్టు ఏర్పాటు

మొగిలి ఘాట్‌లో ప్రమాదాలు నివారించే క్రమంలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు అధికారులు దొరచెరువు వద్ద ప్రత్యేకంగా చెక్‌పోస్టును రెండు రోజుల క్రితం ఏర్పాటు చేశారు. ఓ కానిస్టేబుల్ చెక్ పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తూ ఘాట్ రోడ్డులో వాహనాలు వేగాన్ని క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టారు. డ్రైవర్లకు అవగాహన కల్పించి ప్రమాదాలను కట్టడి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

హైవేపై వేగం తగ్గని వాహనాలు

బెంగళూరు–చెన్నై జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు అతి వేగంగా వాహనాలు నడపడం మూలాన అధికారులు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేక్ల వద్ద అదుపు చేయలేక ముందు వెళ్లే వాహనాలను ఢీ కొడుతున్నారు. దాంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతే కాకుండా వేగంగా వాహనాలు నడపడం వల్ల స్టాపర్ డ్రమ్‌లను ఢీకొనడంతో డ్రమ్‌లు ధ్వంసం అవుతున్నాయి.

డ్రైవర్లలో మార్పు రావాలి

మండలంలో ప్రమాదాల నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదకరమైన మలుపు రోడ్ల వద్ద సూచికలు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి వాహనదారులను హెచ్చరిస్తున్నాం. డ్రైవర్లు ఆలోచించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరగవు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఉన్నాయి. వాహనాల తనిఖీలో భాగంగా మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తున్నాం, రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ వారి అజాగ్రత్త కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

– శ్రీనివాసులు, సీఐ, బంగారుపాళెం


రెండు రోజుల క్రితం ఘాట్‌లో బోల్తాపడ్డ లారీ

జగమర్ల క్రాస్ నుంచే సూచిక బోర్డులు

పలమనేరు నుంచి చిత్తూరు వెళ్లే రహదారి జగమర్ల క్రాస్ నుంచే అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. దొరచెరువు వద్ద నుంచి మొగిలి ఘాట్ మలుపు వరకు అక్కడక్కడ స్పీడ్ బ్రేకర్లు, డ్రమ్‌లు ఏర్పాటు చేశారు. మొగిలి ఘాట్ డౌన్‌లో వాహనాలు 40 కిలోమీటర్ల వేగంగా వెళ్లేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మలుపు రోడ్డు నుంచి మొగిలి క్రాస్ వరకు డ్రమ్‌లు ఏర్పాటు చేశారు. అయినా ఈ నెల 5వ తేదీ మొగిలి ఘాట్‌లోని స్పీడ్ బ్రేకర్ వద్ద మూడు వాహనాలు ఒకదానికొక్కటి ఢీ కొన్నాయి. 13వ తేదీ బెంగళూరు నుంచి తిరుమల పోతున్న కారు ముందు వెళ్తున్న లారీని ఢీ కొనడంతో నలుగురు గాయపడ్డారు. 22న ముందు టమాటా లోడుతో పోతున్న ఈచర్ వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొని వాహనాలు బోల్తాపడ్డాయి.


స్పీడ్ బ్రేకర్ వద్ద ఢీకొన్న వాహనాలు (ఫైల్)

మానవ హక్కుల పరిరక్షణకే ఐక్యరాజ్యసమితి

గుడిపాల: అంతర్జాతీయంగా మానవ హక్కుల పరిరక్షణ కోసమే ఐక్యరాజ్యసమితిని ఏర్పాటు చేసుకున్నారని సీఎస్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న సీఎస్‌ఆర్ కళాశాలలో ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను ఉద్దేశించి ప్రిన్సిపల్ ప్రసంగించారు. అంతర్జాతీయ చట్టాలు, భద్రత, ఆర్థికాభివృద్ధి, మానవ హక్కుల పరిరక్షణ కోసం పనిచేసేలా ప్రపంచ దేశాలు కలిసి ఐక్యరాజ్యసమితిని అక్టోబర్ 24, 1945న స్థాపించినట్లు తెలిపారు. ఇందులో 193 దేశాలు సభ్యులుగా ఉన్నాయన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్ మాట్లాడుతూ శాంతి, భద్రతను కాపాడుకోవడంతో పాటు ఇతర ముఖ్యమైన లక్ష్యాలలో సమానహక్కులు, ప్రజల స్వీయ నిర్ణయానికి సంబంధించిన సూత్రాల ఆధారంగా దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను అభివృద్ధి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలియోపై అవగాహన


రికార్డులను పరిశీలిస్తున్న డీఐఓ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పిల్లల తల్లిదండ్రులకు పోలియోపై అవగాహన కల్పించాలని డీఐఓ హనుమంతరావు పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని ప్రశాంత్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలియో నివారణకు ప్రభుత్వాలు సమష్టిగా కృషి చేస్తున్నాయన్నారు. ఆ దిశగా అధికారులు పనిచేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పోలియో వ్యాధి వ్యాప్తి, నివారణ, టీకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మిషన్ ఇంద్ర ధనస్సులో భాగంగా చేపడుతున్న ఇంటింటా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన వివరించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


పోటీలు నిర్వహిస్తున్న సీఐ కృష్ణమోహన్

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సీఐ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు 'సైబర్ క్రైమ్‌పై యువత పాత్ర' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతిని కిషోర్‌నాయుడు, రెండవ బహుమతిని యామిని, మూడవ బహుమతి వర్షిత, అరుణ్‌కుమార్‌కు అందజేశారు. ఎంపికైన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మనోహర్, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జీతాలు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న చెంగల్‌రాయమండడి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ (1987) రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగల్‌రాయ మండడి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం నాయకులు చిత్తూరు మండల శాఖ కార్య నిర్వాహణ సమితి సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ చిరుద్యోగులైన పారిశుధ్య కార్మికుల పట్ల చిన్నచూపు చూడడం సబబు కాదన్నారు. నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో పెడితే వారి కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, భారతి, కరుణాకరన్, హరిదాసు పాల్గొన్నారు.

మరుదు పాండియన్ వర్ధంతి


నివాళులర్పిస్తున్న మొదలియార్ సంఘ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు స్థానిక గంగినేని చెరువు వద్ద మరుదు పాండియాన్ మెమోరియల్ పార్క్‌లో గురువారం స్వాతంత్ర్య సమరయోధులు మరుదు పాండియన్ సోదరుల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మేయర్ అముద, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బుల్లెట్ సురేష్, మరుదు పాండియన్ సోదరుల చిత్రపటాలకు పూజలు చేసి నివాళులర్పించారు. బుల్లెట్ సురేష్ మీడియాతో మాట్లాడుతూ, స్వతంత్ర పోరాటంలో బ్రిటీష్ వాళ్లను ఎదిరించి ఉరికంభ మెక్కిన యోధులు ఈ మరుదు పాండియన్ సోదరులని గుర్తుచేశారు. వారి విగ్రహావిష్కరణ త్వరలో ఘనంగా చేపడతామన్నారు. అనంతరం పేద ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు అప్పు, కార్పొరేటర్లు, మొదలియార్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలకు చెత్తబుట్టల పంపిణీ


చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

తవణంపల్లె: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపరచాలనే సంకల్పంతో గ్రామాల్లో ప్రతి ఇంటి దగ్గర తడి, పొడి చెత్తను సేకరించడానికి చెత్తబుట్టలు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రెడ్డిబాబు, ఈఓపీఆర్‌డీ కుమార్ తెలిపారు. ప్రస్తుతం మండలంలోని 17 పంచాయతీల్లో 8,962 కుటుంబాలు ఉండగా, ఒక్కొక్క కుటుంబానికి రెండు చెత్తబుట్టల చొప్పున పంపిణీ చేసినట్లు వెల్లడించారు. నవంబర్ 1వ తేదీ నుంచి ప్రతి పంచాయతీలో చెత్తను సేకరించి బృందావనాలు వినియోగంలోకి తెస్తామని వివరించారు.

కత్తి సాములో కాంస్య పతకాలు


విజేతలైన క్రీడాకారులతో హెచ్‌ఎం, పీడీ

ఐరాల: అండర్–17 ఫెన్సింగ్ (కత్తి సాము) రాష్ట్ర స్థాయి పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలో నిర్వహించిన ఈవెంట్ సాబర్ విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు మహేష్, రోహిత్ కాంస్య పతకం, ఈపీఈఈ ఈవెంట్‌లో రంజిత్‌కుమార్ కాంస్య పతకం సాధించారని పేర్కొన్నారు. క్రీడాకారులు పతకాలు సాధించి తమ పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారని హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులను, పీడీ దేవాను ఖేలో ఇండియా కోచ్ రాఘవ కార్తీక్, ఎస్‌ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

నట్టల నివారణ మందు వేయించాలి


నట్టల నివారణ మందు తాగిస్తున్న డాక్టర్ రవితేజ

గుడిపాల: జీవాల్లో ప్రధానంగా గొర్రెలు, మేకల్లో సంతతి అభివృద్ధికి నట్టల నివారణ మందు తప్పని సరిగా వేయించాలని బొమ్మసముద్రం వైద్యాధికారి రవితేజ అన్నారు. మంచిక్రిష్ణాపురం పంచాయతీలో గురువారం జీవాలకు నట్టల నివారణ మందు తాగించారు. దీని వల్ల జీవాల కడుపులో ఉన్న నులిపురుగులు చనిపోతాయని చెప్పారు. అక్టోబర్ 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు మండలంలో గొర్రెలు, మేకలు 10,385 ఉన్నాయని ఇప్పటివరకు 80శాతం పూర్తిచేసినట్లు ఆయన వివరించారు.

చెరువులకు జలకళ

వెంగంపల్లె వద్ద ఊరుముందర చెరువుకు జలకళ


వెంగంపల్లె సమీపంలో నిండిన కమ్మవాని చెరువు


టి.పుత్తూరు సమీపంలో నీటి కుంటకు చేరిన వర్షపునీరు


తవణంపల్లె: తుపాను నేపథ్యంలో వరుసగా వర్షాలు కురవడంతో మండలంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు జలకళ సంతరించుకున్నాయి. మండలంలో వారం రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు ప్రవహించి కుంటలు, చెక్‌డ్యాంలు, చెరువులు నిండాయి. మండలంలో 57 చెరువుల్లో 30 నిండిపోయాయి. మిగిలిన చెరువులకు నీరు చేరింది కానీ నిండలేదు. దిగువ మోదలపల్లె కొత్త కుంట, మర్రిమాను కుంటలు నిండిపోయాయి. దిగువమాఘం వద్ద రాజన్న చెక్‌డ్యాం, అరగొండ దగ్గర చెక్‌డ్యాం, టి.పుత్తూరు దగ్గర ఉన్న చెక్‌డ్యాం, ఎగువ తవణంపల్లె దగ్గర ఉన్న చెక్‌డ్యాంలు నిండి మొరవ పోతున్నాయి. మాదవరం సమీపంలోని దొరచెరువు నిండి మొరవపోతున్నది. వెంగంపల్లె దగ్గర ఊరుముందర చెరువు, కమ్మవాని చెరువు, దిగువ చెరువు నిండి మొరవపోతున్నాయి. ఉధృతంగా ప్రవహించిన అరగొండ బహుదానది ప్రవాహ వేగం తగ్గింది. అయితే నియోజకవర్గంలోని ఇతర మండలాల్లో వర్షం కురిసినప్పటికీ చెరువుల్లోకి నీరు రాకపోవడం గమనార్హం.


కంపలపల్లె దగ్గర నిండిన చెక్‌డ్యాం


దిగువ మోదలపల్లె సమీపంలో నిండిన కొత్తకుంట


పొంగిపొర్లుతున్న రాజన్న చెక్‌డ్యాం